సాక్షి
జగిత్యాల

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024

జిల్లాకేంద్రంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారులు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అన్ని రంగాల్లో ముందంజ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్



రాయికల్‌లో బోనం, బతుకమ్మతో చిన్నారులు



జెండావందనం చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నాం
- మహిళలకు మహాలక్ష్మీ పథకం వరం
- ఆరోగ్యశ్రీ సహాయ పరిమితిని పెంచాం
- నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నాం
- స్వాతంత్య్ర వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ.. ప్రజలకు భరోసా ఇస్తున్నామని వెల్లడించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ఇప్పటివరకు 2,00,11,965 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్య్ర వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు.

ఆరోగ్యశ్రీ వైద్య సహాయ పరిమితి పెంపు

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, 1675 రకాల చికిత్స చేయించుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు, ధర్మపురి, కోరుట్ల పట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నర్సింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయని, పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేస్తామని, నూకపల్లిలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల పూర్తికి ఇటీవల రూ.18 కోట్లు మంజూరు చేశామన్నారు. మహాలక్ష్మీ పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఇప్పటివరకు 2,89,725 కుటుంబాలు లబ్ధిపొందాయని వివరించారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 1,94,073 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయని పేర్కొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

రైతుల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపేందుకు రైతుబీమా, రైతు రుణమాఫీ అమలు చేస్తున్నామని అడ్లూరి అన్నారు. కల్తీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, 58,852 మంది రైతులకు రూ.375.50 కోట్లు జమ చేశామన్నారు. యాసంగిలో 419 కొనుగోలు కేంద్రాల ద్వారా 4,27,814 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.942 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. రైతుబీమాకు 1,32,486 మంది నమోదు చేసుకున్నారని, 424 మంది కుటుంబాలకు రూ.212 కోట్ల బీమా అందిందని వెల్లడించారు. 19 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. 50 శాతం సబ్సిడీపై పశువులు, దేశీకోళ్లు అందించామన్నారు. వందశాతం సబ్సిడీపై చెరువుల్లో రొయ్య పిల్లలను పంపిణీ చేస్తామన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

జిల్లాలో 577 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి వసతులు కల్పించామని, ఇందుకు రూ.32 కోట్లు కేటాయించామని, ఇప్పటివరకు రూ.20 కోట్లు ఖర్చు చేశామని విప్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు రూ.20 లక్షల చొప్పున సహాయం అందిస్తామన్నారు. వన మహోత్సవంలో భాగంగా 24.30 లక్షల మొక్కలు నాటుతామన్నారు. గతేడాది నాటిన మొక్కలను బతికించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధి హామీ ద్వారా ఇప్పటివరకు 1,67,612 జాబ్ కార్డుల ద్వారా 33.25 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. బ్యాంక్ లింకేజీ కింద 1,868 సహాయ సంఘాలకు రూ.192.60 లక్షల రుణాలు అందించామన్నారు. మహిళాశక్తి కింద మహిళాసంఘాలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, కళాశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు కుట్టే బాధ్యత అప్పగించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లతో అందిస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా..

గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు కొనుగోలు చేసి ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 380 పంచాయతీల్లో కాలువలను శుభ్రం చేయించామని, దోమల నివారణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు నూలు, రసాయనాల కొనుగోలుపై 40 శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. రూ.152 కోట్లతో 28 హైలెవల్ బ్రిడ్జి పనులు మంజూరు చేశామని, 26 పనులు పూర్తయి, రెండు పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. టీజీఐపాస్ పథకం కింద జిల్లాలో 74 పరిశ్రమలు, 103 అనుమతులకు దరఖాస్తులు రాగా.. 102 దరఖాస్తులను ఆమోదించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చేధనకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని విప్ అన్నారు. సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జడ్జి నీలిమ, అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ సమ్మయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జగిత్యాలటౌన్: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాయికల్ కేజీబీవీ విద్యార్థులు ఆలపించిన దేశరంగీలా, ధర్మపురిలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థుల సుజలాం, సుఫలాం గీతం, కొడిమ్యాల కేజీబీవీ విద్యార్థుల జయహోజయ తెలంగాణ, తాటిపల్లి బాలికల గురుకులం విద్యార్థుల నూటొక్క రాగాల తెలంగాణ, లక్ష్మీపూర్ జ్యోతిబాపూలే బీసీ హాస్టల్ విద్యార్థుల ఎత్తర జెండా, జగిత్యాల కేజీబీవీ విద్యార్థుల వందేమాతరం గీతాలపై నృత్య ప్రదర్శనలు అలరించాయి.

న్యూస్‌రీల్

జెండాను ఆవిష్కరించిన కలెక్టర్



జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

త్యాగధనులతోనే దేశానికి స్వేచ్ఛ



జెండా ఎగురవేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: ఎంతోమంది త్యాగధనులతో దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం వచ్చిందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. ప్రతిఒక్కరూ దేశసేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. పోలీసు అధికారులు జాతి సమగ్రత, సమాజంలో శాంతిస్థాపనకు కృషి చేయాలన్నారు. మహానుభావుల త్యాగాలను నిరంతరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. పిల్లలకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, రవీంద్రకుమార్, ఏవో శశికళ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, కిరణ్‌కుమార్, వేణు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే సంజయ్



జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో అమరులైన వారి సేవలను కొనియాడారు.



జిల్లాకేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆకట్టుకున్న విద్యార్థినులు నృత్యం



జిల్లాకేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాలతో చిన్నారుల ప్రదర్శన



రాయికల్‌లో బోనాలతో చిన్నారులు

31,560 మంది రైతులు.. రూ.552.19 కోట్లు

- మూడో విడత రుణమాఫీ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాతాల్లో జమ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం మూడో విడత రుణమాఫీకి గురువారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణం ఉన్న 31,560 మంది రైతులు లబ్ధిపొందనున్నారు. వీరికి సంబంధించిన 41,777 ఖాతాల్లో మొత్తం రూ.552.19 కోట్లను జమచేసే ప్రక్రియను ప్రారంభించింది.

మూడు విడతల్లో... రూ.1843.19 కోట్లు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో రూ.2 లక్షల లోపు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆగస్టు 15లోపు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ప్రకటించారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు కాలపరిమితి (కటాఫ్)గా నిర్దేశించారు. మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలను జూలై 18న మాఫీ చేసింది. మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలో 12,8,762 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ. 710.29 కోట్లు జమచేసింది. జూలై 30న రెండో విడతలో రూ.లక్షన్నరలోపు రుణాలు ఉన్న 63,286 మంది ఖాతాల్లో రూ. 580.71 కోట్లు మాఫీ చేసింది. మూడో విడతలో రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న 41,777 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.552.19 కోట్లు మాఫీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. మొత్తంగా మూడు విడతల్లో కలిపి 2,33,824 ఖాతాల్లో రూ. 1843.19 కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది.

కొర్రీలతో మాఫీకాక అవస్థలు

మూడు విడతల్లో రుణ మాఫీ చేసిన, చాలా మంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో వారందరూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు ఖాతాలో ఒక పేరు, ఆధార్‌లో మరోపేరు, రేషన్ కార్డు లేక, వడ్డీ ఎక్కువ అయ్యి.. ఇలా దాదాపు 32 కారణాలతో పలువురు రైతులకు మాఫీ కాక ఇబ్బందులు తలెత్తాయి. ఆయా జిల్లాలో రైతులకు ఏవైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే నివృత్తి, పరిష్కారం చేసేందుకు మండలాలవారీగా ఏవో, ఏఈవోలను సంప్రదించవచ్చని, ప్రత్యేకంగా రిజిస్టర్ నిర్వహిస్తూ సమస్య పరిష్కరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్‌జిల్లా రుణమాఫీ వివరాలు..

	మొదటి విడత		రెండో విడత		మూడోవిడత	
జిల్లా	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)	ఖాతాలు	మాఫీ (రూ.కోట్లలో)
కరీంనగర్	36,023	186.39	18,510	173.28	12,034	152.65
జగిత్యాల	39,229	207.00	19,623	169.00	13,799	172.34
పెద్దపల్లి	29,724	149.42	13,238	122.43	8,268	101.75
సిరిసిల్ల	23,785	167.48	11,915	116.00	7,676	125.45
మొత్తం	1,28,761	710.29	63,286	580.71	41,777	552.19

కెపాసిటర్లు బిగించుకోవాలి

మల్లాపూర్: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, తద్వారా 20శాతం విద్యుత్ ఆదా అవుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలకేంద్రంలో రైతులకు కెపాసిటర్ల బిగింపుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోందన్నారు. వ్యవసాయ, గృహ, వాణిజ్య సముదాయాలు కరెంట్ బకాయిలను సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు. ప్రతి రైతుకు ఉచిత విద్యుత్ ద్వారా ఏటా ప్రభుత్వం రూ.25వేల ఖర్చు చేస్తోందని, కెపాసిటర్లు బిగించుకుంటే 20శాతం విద్యుత్ ఆదా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు దేవేందర్, శ్రీనివాస్, లైన్‌మన్ రవితేజ, జేఎల్ఎం రంజిత్, ట్రాన్స్‌కో సిబ్బంది సోమేశ్, రైతులు పాల్గొన్నారు.



కెపాసిటర్లపై అవగాహన కల్పిస్తున్న ఏడీఈ శ్రీనివాస్‌రావు



129 మందికి ఒకటే మరుగుదొడ్డి

సాక్షిలో వచ్చిన కథనం

గడికోట పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్‌లోని గడికోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో ఎంపీడీవో చిరంజీవి యుద్ధప్రతిపాదికన మూడు మరుగుదొడ్లను నిర్మించారు. గతనెల 24న 'సాక్షి' మెయిన్ పేజీలో '129 మందికి ఒకటే మరుగుదొడ్డి' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



నిర్మించిన మరుగుదొడ్లు

ఆకట్టుకున్న వివిధ శాఖల స్టాళ్లు



మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో వస్తువులు పరిశీలిస్తున్న విప్ అడ్లూరి

జగిత్యాలఅగ్రికల్చర్: పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ప్రజలు వాటిని సందర్శించి పథకాల గురించి తెలుసుకున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పశు సంవర్ధక, గ్రామీణాభివృద్ధి, షెడ్యూల్ కులాల అభివృద్ధి, అటవీ, మహిళ, శిశు, వికలాంగుల అభివృద్ధి, వ్యవసాయ, విద్యుత్, ఉద్యానశాఖలు స్టాళ్లు ఏర్పాటు చేసాయి. ఈసారి కొత్తగా పోలీస్‌శాఖ తాము ఉపయోగిస్తున్న ఆధునాతన ఆయుధాలు, న్యూ టెక్నాలజీ పరికరాలపై అవగాహన కల్పించాయి. స్టాళ్లను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు.

భారీ బందోబస్తు

జగిత్యాలక్రైం: పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్‌లోకి వెళ్లేవారిని క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరమే అనుమతించారు. వేడుకలను చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు. మొత్తంగా 125 మంది కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలను నియమించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షించారు.



పోలీస్‌శాఖ స్టాల్



ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన స్టాల్

క్లుప్తంగా

కింద పడిపోయిన డ్రోన్

జగిత్యాల: పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ఎగురవేశారు. అయితే అది ఉన్నట్టుండి కిందపడిపోయింది. అదే సమయంలో ఫొటో తీస్తున్న ఓ జర్నలిస్టుకు తగిలింది. సదరు వ్యక్తికి డ్రోన్ తగిలిందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారి వాణి వివరణ ఇస్తూ.. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన డ్రోన్ పడిపోయిందని, ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

స్వగ్రామానికి వలస జీవి మృతదేహం

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన ఉత్కం శ్రీనివాస్ గౌడ్ (48) దుబాయిలో గతనెల 17న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది. శ్రీనివాస్ గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ఇక్కడ సరైన పని లేక ఈ ఏడాది మార్చిలో దుబాయి వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా ఎండవేడికి వడదెబ్బకు గురయ్యాడు. అంతలోనే గుండెపోటు కూడా రావటంతో తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

హమాలీ మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గొల్లపల్లి సమీపంలోని ఓ గోదాంలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన సీతుకుమార్‌సదా(22) అనే హమాలీ మృతి చెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం .. సీతుకుమార్‌సదా మూడు నెలల క్రితం గోదాంలో పనిచేసేందుకు వచ్చాడు. బుధవారం రాత్రి తన గదిలో ఉక్కపోతగా ఉండడంతో సమీపంలో పార్కింగ్ చేసిన లారీపై నిద్రపోయాడు. నిద్రమత్తులో ప్రమాదవశాత్తు కింద పడగా తలకు తీవ్రగాయమైంది. తోటి హమాలీలు సుల్తానాబాద్ ఆస్పత్రి, అక్కడి నుంచి కరీంనగర్, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా చనిపోయాడు.

ముగిసిన తల్లీకూతుళ్ల అంత్యక్రియలు

- నివేదిక కోరిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ
- బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): డెంగీతో మృతిచెందిన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన బాలింత తాళ్లపల్లి శిరీష, పసికందు అంత్యక్రియలను గురువారం పూర్తి చేశారు. శిరీష భర్త బతుకుదెరువు కోసం జోర్డాన్ దేశానికి వెళ్లగా.. అతను స్వగ్రామం వచ్చే వరకు మృతదేహాలను ఫ్రీజర్‌లో భద్రపరిచారు. మృతురాలి భర్త చంద్రం గురువారం ఉదయం గ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. డెంగీతో మరణించినట్లు వార్త కథనాలు ప్రచురితం కావడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివేదిక కోరారు. ఈమేరకు జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు ఆదేశాలతో మండల వైద్యాధికారి స్రవంతి గ్రామంలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వివిధ సంఘాలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఒకరు దుర్మరణం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నం, గొల్లపల్లి గ్రామశివారుల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల వివరాలు.. కొత్తగట్టుకు చెందిన కొయ్యడ కొమురయ్య ద్విచక్రవాహనంపై మొలంగూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గొల్లపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. లింగాపూర్‌కు చెందిన గొరవేని ప్రశాంత్, చల్లూరి నిఖిల్(15) మోటార్‌సైకిల్‌పై మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. ప్రశాంత్ అతివేగంగా మోటార్‌సైకిల్ నడపడంతో వెనకకూర్చున్న నిఖిల్ రోడ్డుపై పడి మృతిచెందాడు. మృతుడి తల్లి రజిత ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

పనితీరుకు 'ప్రశంస'

జగిత్యాలటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన వారికి గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతులమీదుగా పురస్కారాలు అందించారు.



సుమన్, డీటీ



భూమేశ్, ఏఈవో, మెట్‌పల్లి | హన్మంతరావు, ఏవో, కలెక్టరేట్ | నరేష్ డీడబ్ల్యూవో | వినోద్, ఏఈవో | మదన్‌మోహన్, అదనపు డీఆర్డీవో



సాయిబాబా, బీసీ వెల్ఫేర్ | మహేశ్వర్‌రెడ్డి, ఎంపీవో మెట్‌పల్లి | ఎండీ.వకీల్, డీటీ | రాజేందరరావు, ఆర్ఐ | పి.గౌతంరెడ్డి ఏసీఎల్బీ | రఘువరన్ పీడీ, డీఆర్డీఏ | మధుసూదన్, ఆర్డీఓ, జగిత్యాల | గోపాల్, సీనియర్ అసిస్టెంట్ | మమతారావు, ఈడీఎం | శ్రీనివాస్‌బాబు, వెటర్నరీ



వనితారాణి, జూఅ, ఎల్‌ఏ | శివాని, టైపిస్ట్, డీపీఆర్వో | కొండయ్య, టైపిస్ట్, డీపీఆర్వో | జగన్, ఓఎస్, డీపీఆర్వో | నిరంజన్, పీడీ | సుగుణాకర్ జూఅ, డీఈవో | సంతోష్ పంఅ, ఎంపీడీవో | గంగాధర్ హెచ్‌సీ, ఇంటలిజెన్స్ | శ్రీనివాస్‌గౌడ్, హెల్త్ | ఖాన్, ఓఎస్, కలెక్టరేట్

కథలాపూర్‌లో జ్వరం.. జ్వరం



డెంగీతో చికిత్స పొందుతున్న షేక్ అమీర్, కొత్తపెల్లి వనిత



బస్టాండ్ ఏరియాలో మురికికాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రజలు జ్వరంతో అవస్థలు పడుతున్నారు. వర్షకాలం కావడంతో ఆయావాడల్లో మురికికాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు నిల్వడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామంలో సుమారు 100 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్నవారు గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స చేయించుకున్నా.. మూడు నాలుగు రోజులు తగ్గకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగెత్తుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిన వారికి అక్కడ రక్త పరీక్షలు చేసి డెంగీ జ్వరం అని చెప్పడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెలలో గ్రామానికి చెందిన నలుగురు డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది. అయినా పారిశుధ్యం పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. పంచాయతీ అధికారులతోపాటు వైద్య శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యంపై దృష్టిసారించాలని కథలాపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసులకు సేవా పతకాలు



పోలీసు పతకాలు అందుకున్న వారితో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో విశేష సేవలందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పతకాలను ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లా పోలీసులకు అందించారు. పతకాలకు 26 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అందుకున్నారు. ఎం.రమేశ్ అంత్రిక్ సురక్ష సేవ పతకం, ఎండీ.అలీమోద్దీన్ ఏఎస్సై, ఎండీ.నసీర్‌ఖాన్ హెడ్ కానిస్టేబుల్ ఉత్తమ సేవ, ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, ఏఆర్ ఎస్సై వి.రవీందర్, ఏఎస్సై రవీందర్‌రావు, ఏఎస్సై సత్యనారాయణ, ఏఎస్సై ఎండీ.సందాని, ఏఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై రామయ్య, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్లు తిరుపతి, బహదూర్, చంద్రయ్య, గంగారాం, శాంతయ్య, రాజశ్రీ, రాజేంద్రప్రకాశ్, రఘుపతి సేవ పతకం, అలాగే ఏఎస్సై శ్రీనివాస్, ఏఎస్సై సీహెచ్.శ్రీనివాస్, ఏఎస్సై అజ్మీర దేవేందర్, హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డికి అతి ఉత్కృష్ట సేవ, కానిస్టేబుళ్లు రమేశ్, రవీందర్ ఉత్కృష్ట సేవ పతకం అందుకున్నారు. వీరందరినీ ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, ఎస్బీ సీఐ అరీఫ్ అలీఖాన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, వేణు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపర్చిన నితీషరెడ్డి ప్రదర్శన



ప్రశంస పత్రం అందుకుంటున్న నితీషరెడ్డి

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన విజయ్‌రెడ్డి, రాధ కూతురు నితీషరెడ్డి గురువారం సౌదీ అరేబియాలోని రియాద్‌లోని ఇంటర్నేషనల్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో ఇండియన్ ఎంబసీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భారతీయ శాస్త్రీయ నృత్యం చేసి ఆకట్టుకుంది. రియాద్ ఇండియన్ అంబాసిడర్ సోహెల్ అజాజ్‌ఖాన్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంది.

చెట్టును ఢీకొన్న కారు

- భార్యాభర్తలకు గాయాలు



మాచారెడ్డి: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన నరేందర్ రెడ్డి, రేణుక దంపతులు పనినిమిత్తం కారులో కామారెడ్డికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని ఘన్‌పూర్ శివారులోకి రాగానే కారు అదుపు తప్పడంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో కారులో ఉన్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

మంత్రితో ఎమ్మెల్సీ భేటీ

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి భేటీ అయ్యా రు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు వచ్చిన శ్రీధర్‌బాబును జ్యోతినగర్‌లోని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాసంలో జీవన్‌రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో జీవన్‌రెడ్డి అలకబూనడం తెలిసిందే. ఆ సమయంలో కాంగ్రెస్ అధిష్టానం తరపున మంత్రి శ్రీధర్‌బాబు జగిత్యాలకు వెళ్లి జీవన్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఈక్రమంలో గురువారం నగరంలో మంత్రి, ఎమ్మెల్సీల భేటీ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ భేటీలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కూడా ఉన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శ్రీధర్‌బాబును డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ, కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

తీజ్ ఉత్సవాలతో గిరిజనుల్లో చైతన్యం



తీజ్ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: తీజ్ ఉత్సవాలతో గిరిజనుల్లో చైతన్యం వస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాజారాం తండాలో గురువారం తీజ్ ఉత్సవాలకు హాజరయ్యారు. గిరిజనులతో ఆడి పాడి వారిలో సంతోషాన్ని నింపారు. మండల కేంద్రంలో నిర్మించిన రామాలయంలో పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తిరుపతినాయక్, రవినాయక్, మేగ్యానాయక్, వంగ మహేశ్, బోదాస్ నర్సయ్య, పులి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీజేపీ కౌన్సిలర్ మృతి

- మూడు రోజుల కిందట అస్వస్థత
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి



మర్రి పోచయ్య (ఫైల్)

మెట్‌పల్లి: అనారోగ్యంతో బాధపడుతూ.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మెట్‌పల్లికి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య (54) మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. ఇంట్లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు ముందుగా స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోచయ్య చనిపోయారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీజేపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, విద్యాసాగర్ రావు, ఇతర పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రేమలో పడిందని చెల్లిపై దాడి

మెట్‌పల్లిరూరల్: తోడబుట్టిన చెల్లి ఓ యువకుడిని ప్రేమిస్తోందనే కారణంతో సోదరుడు ఆమెపై దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజ్‌కుమార్, మానస అన్నాచెల్లెళ్లు, ఇద్దరూ ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట శివారులోని టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోలార్, బ్యాంకింగ్ ఫైనాన్స్ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నారు. గురువారం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అన్నాచెల్లెళ్లు ఇంటికి వెళ్తున్న సమయంలో మానస ప్రేమ వ్యవహారం చర్చకు వచ్చింది. తీరు మార్చుకోవాలని చెల్లెకు రాజు సూచించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులోని వరద కాలువ వద్దకు తీసుకెళ్లాడు. ఆమెపై విచక్షణరహితంగా కర్రతో దాడికి పాల్పడ్డాడు. అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను చూసిన స్థానికులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు మానసను మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పరుగు పందెంలో ప్రతిభ



గుడ్ల మనోహర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గుడ్ల మనోహర్ రాష్ట్రస్థాయిలో 100మీటర్ల పరుగు పందెంలో నాలుగో ర్యాంకు సాధించాడు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మనోహర్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు మాదం వినోద్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, గడ్డం జలంధర్, నాయకులు పాల్గొన్నారు.



ఆనందంగా ఊయల ఊగుతున్న గిరిజన అమ్మాయిలు



సంప్రదాయ నృత్యాలు చేస్తూ...

ఘనంగా తీజ్ పండుగ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండాలో గురువారం గిరిజనులు తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. మంచి అబ్బాయిలతో పెళ్లికావాలని కోరుతూ అమ్మాయిలు గోధుమలను నానబెట్టి 9 రోజులపాటు వాటికి నీళ్లు పోస్తూ ఉపవాస దీక్షలు తీసుకుంటారు. చివరిరోజు గోధుమ మొలకలతో అమ్మాయిలు ఎత్తుకొని డీజే పాటలతో నృత్యాలు చేస్తు ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.



గోధుమనారుతో గిరిజన అమ్మాయిలు